ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి
మంగళవారం | 23 జూన్ , 2026 | పేజీలు : 05

## ఆమనగల్లులో పిడుగుపడి ఆవు మృతి



**ప్రజా పక్షం/వేములపల్లి:** మండలంలోని ఆమనగల్లు గ్రామంలో పిడుగు పడి ఓ ఆవు మృతి చెందిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. ఆమనగల్లు గ్రామానికి చెందిన రైతు ఉత్తెర్ల కృష్ణ తన వ్యవసాయ పనులకు ఆవును పొలం వద్దకు తీసుకెళ్లాడు.ఈక్రమంలో మధ్యాహ్నం ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది.అకస్మాత్తుగా పిడుగు పడటంతో ఆవు అక్కడికక్కడే మృతి చెందింది. ఘటనను గమనించిన వ్యవసాయ కూలీలు, స్థానిక రైతులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు.ఆవు మృతి చెందడంతో రైతు ఉత్తెర్ల కృష్ణ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాడు.

## ప్రజావాణికి గతం కంటే అత్యధిక ఫిర్యాదులు



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మిర్యాలగూడ రెవిన్యూ డివిజన్ కార్యాల యం కాన్ఫరెన్స్ హాలులో ఆర్డీఓ ఎస్.రమణారెడ్డి అధ్యక్షతన సోమవారం జరిగిన డివిజన్ స్థాయి ప్రజావాణికి అత్యధిక ఫిర్యాదులు వచ్చాయి. ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణికి నాలుగైదు ఫిర్యాదులే రాగా సోమవారం జరిగిన ప్రజావాణిలో సుమారు 20 వరకు ఫిర్యాదులు వచ్చాయి. దామరచర్ల మండలం వీర్లపాలెం యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ ప్రైవేట్ పరం చేయొద్దని కోరుతూ వాడపల్లి తెలంగాణ ఉద్యమకారుడు కె.నాగేశ్వర్‌రావు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ రంగ సంస్థ ఉద్యోగిగా చేరిన భూ నిర్వాసితుల పరిస్థితి ఏం కావాలని ప్రశ్నించారు. అదేవిధంగా అనుముల మండలం హాజారిగూడెంకు చెందిన దివ్యాంగురాలు మరుగుజ్జు తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని దరఖాస్తు చేసుకుంది. తన భార్య పేర ఉన్న భూమిలో వేములపల్లి మండలం బుగ్గబావిగూడెం గ్రామపంచాయతీ భవనం నిర్మించేందుకు సర్పంచ్ భర్త వెంకట్ రెడ్డి యత్నిస్తున్నాడని నిలుపుదల చేయాలని పి.గుర్వయ్య ఫిర్యాదు చేశారు. అదేవిధంగా మునిసిపల్ కౌన్సిలర్ పందిరి అనిత తన భూ సమస్య పరిష్కరించాలని కోరుతూ ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ రమణారెడ్డి మాట్లాడుతూ ప్రతి రెవిన్యూ డివిజన్ కార్యాలయంలో గ్రామీణ ప్రజల సౌకర్యార్థం ప్రజావాణి నిర్వహిస్తున్నామని ప్రజల అర్జీలు స్వీకరించి సత్వరం పరిష్కరించాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పి. శ్రీనివాస్, ఎంపీడీఓ ఎం.శేషగిరిశర్మ వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కె.జగదీశ్వర్‌రెడ్డి, ఎంపీపి సూపరింటెండెంట్ కరుణాకర్, మునిసిపాలిటీ మేనేజర్ జి.జ్ఞానేశ్వరి, ఐసిడిఎస్ మిర్యాలగూడ అర్బన్ పిఓ వేణు, ఉద్యానవన శాఖ డివిజన్ అధికారి నసీమా మెహ్రిన్, నీటిపారుదల శాఖ ఆర్ అండ్ బి, నీటిపారుదల, ఆర్ డబ్ల్యుఎస్, హౌజింగ్ డిఇలు శ్రీనివాస్ పాల్గొన్నారు.

## తెలంగాణ పబ్లిక్ స్కూల్‌తో పేద విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి విద్య

### ఎస్ఎస్‌సి బోర్డు డైరెక్టర్ లింగయ్య



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాల పేద విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి నాణ్యమైన విద్యను ఉచితంగా అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ సంకల్పమని విద్యాశాఖ ఎస్ఎస్‌సీ బోర్డు డైరెక్టర్ లింగయ్య అన్నారు. మిర్యాలగూడ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను నూతనంగా ప్రతిపాదించిన తెలంగాణ పబ్లిక్ స్కూల్‌గా మార్చే ప్రక్రియలో భాగంగా సోమవారం ఆయన నేతృత్వంలోని రాష్ట్ర స్థాయి ఉన్నత అధికార పరిశీలన బృందం పాఠశాలలో విస్తృత తనిఖీలు చేపట్టింది. ఈ సందర్భంగా పాఠశాలలోని తరగతి గదుల సామర్థ్యం, డిజిటల్ ప్రయోగశాలలు, క్రీడా మైదానాలు, తాగునీటి సదుపాయం మరియు ఉపాధ్యాయుల విద్యా ప్రమాణాల వసతులను బృందం క్షుణ్ణంగా పరిశీలించింది. ఈ సందర్భంగా ఎస్ఎస్‌సీ బోర్డు డైరెక్టర్ లింగయ్య మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది, కార్పొరేట్ విద్యా సంస్థలకు గట్టి పోటీనిచ్చేలా ఈ పబ్లిక్ స్కూళ్లను తీర్చిదిద్దనున్నట్లు వెల్లడించారు. ఆధునిక విద్యా సదుపాయాలతో పాటు నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు రాణించేందుకు అవసరమైన సాంకేతిక నైపుణ్యాలను, కమ్యూనికేషన్ స్కిల్స్‌ను ఇక్కడ ఉచితంగా అందిస్తామన్నారు. ఈ వినూత్న విద్యా విధానం ద్వారా ఎంతో మంది ప్రతిభావంతులైన పేద విద్యార్థుల ఉన్నత విద్యా అవకాశాలకు, వారి భవిష్యత్ ఉజ్వల పురోగతికి బలమైన పునాది పడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కేవలం విద్యాబోధనే కాకుండా విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేలా మెరుగైన విద్యా వాతావరణం కల్పించడమే ఈ ప్రాజెక్ట్ యొక్క ముఖ్య ఉద్దేశమని వివరించారు. పాఠశాల సమగ్ర అభివృద్ధికి తీసుకోవాల్సిన తుది నివేదికను ప్రభుత్వానికి సమర్పిస్తామని డైరెక్టర్ తెలిపారు. పరిశీలన కార్యక్రమంలో నల్లగొండ జిల్లా విద్యాధికారి పి. సుశీందరరావు, సూపరింటెండెంట్ ఇంజినీరింగ్ బాల ప్రసాద్, మిర్యాలగూడ ఎంఈఓ ధర్మనాయక్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రేపాల శ్రీనివాస్, డీఈఓ శైలజ, ఈఈ సానముద్దీన్, రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.



## మారుతి సుజుకి విక్టోరిస్ ఎడ్జ్ ఎడిషన్ లాంచ్

### ప్రారంభించిన మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్‌రెడ్డి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** మార్కెట్లోకి నూతన డిజైన్,అధునాతన సాంకేతికతతో వచ్చే వాహనాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నల్లగొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి సూచించారు.సోమవారం నల్లగొండ పట్టణంలోని చర్లపల్లి రోడ్‌లో ఉన్న పవన్ మోటార్స్‌లో మారుతి సుజుకి అరేనా సరికొత్త విక్టోరిస్ ఎడ్జ్ ఎడిషన్ కారును మేయర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.సరికొత్త ఎడిషన్‌ను నల్లగొండకు తీసుకురావడం సంతోషంగా ఉందని,పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆమె కోరారు.పవన్ మోటార్స్ ఎండీ కోమటిరెడ్డి చంద్ర పవన్ రెడ్డి మాట్లాడుతూ ఆకర్షణీయమైన శైలి, ప్రీమియం ఫీచర్లు, మారుతి సుజుకి విశ్వసనీయతతో విక్టోరిస్ ఎడ్జ్ ఎడిషన్ నల్లగొండ వినియోగదారులకు అందుబాటులోకి వచ్చిందన్నారు.ప్రత్యేకమైన డిజైన్,అధునాతన సాంకేతికతతో ఈ ఎస్‌యూవీ విభాగంలో బలమైన పోటీదారుగా నిలుస్తుందని తెలిపారు. ప్రత్యేక లాంచ్ ఆఫర్లు, టెస్ట్ డ్రైవ్‌ల కోసం అద్దంకి బైపాస్ రోడ్, చర్లపల్లిలోని పవన్ మోటార్స్‌ను సందర్శించాలని కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి,కార్పొరేటర్లు జానకి గుమ్మల మోహన్ రెడ్డి,బొజ్జ శంకరయ్య,దొడ్డి రమేష్,పేరిక స్వాతి వినాయక్ రాజ్, సీసీఓ కందాల రవి రెడ్డి,జీఎం నాగమణి, సుధాకర్ వినియోగదారులు పాల్గొన్నారు.

## గుండెపై చెరగని అభిమానం..

### ఎమ్మెల్యే వీరేశం చిత్రాన్ని గుండెపై టాటూగా ముద్రించుకున్న వెంకన్న



**ప్రజాపక్షం/నకిరేకల్ :** ప్రభుత్వ విప్,నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పట్ల తనకున్న అభిమానాన్ని సూర్యాపేట పట్టణానికి చెందిన మొండికత్తి వెంకన్న వినూత్నంగా చాటుకున్నారు. ఆయన చిత్రాన్ని తన గుండెపై టాటూగా వేయించుకుని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.ఈ సందర్భంగా సోమవారం నకిరేకల్‌లో ఎమ్మెల్యే వేముల వీరేశంను వెంకన్నమర్యాదపూర్వకంగా కలిసి తన ఛాతీపై వేయించుకున్న టాటూను చూపించారు. తనపై చూపుతున్న అభిమానాన్ని చూసి ఎమ్మెల్యే హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా వేముల వీరేశం మాట్లాడుతూ,ప్రజల ప్రేమాభిమానాలు తనకు మరింత బాధ్యతను గుర్తు చేస్తున్నాయని అన్నారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకునేందుకు నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. అభిమానుల ఆదరణే తనకు మరింత ప్రేరణనిస్తోందని చెప్పారు.ఎమ్మెల్యే చిత్రంతో కూడిన టాటూ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ గా మారింది.

# విత్తన మేళాను రైతులు సద్వినియోగం

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** వ్యవసాయ రంగంలో వస్తున్న ఆధునిక మార్పులకు అనుగుణంగా రైతులకు సకాలంలో నాణ్యమైన విత్తనాలను అందించడమే ప్రభుత్వ ధ్యేయమని ఏవో రుషేంద్రమణి అన్నారు. ఈ నెల 23 నుండి 30 వరకు మిర్యాలగూడ రైతు వేదికలో జరిగే విత్తన మేళాకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. మంగళవారం ఉదయం 10:30 గంటలకు ప్రారంభమయ్యే ఈ శిబిరంలో ప్రభుత్వం సిఫారసు చేసిన 8 సన్న రకాల వరి విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. వరి విత్తనాలతో పాటు పప్పు దినుసుల విత్తనాలు, నూనె గింజల విత్తనాలు, కూరగాయల విత్తనాలు, పంట దిగుబడిని పెంచే నానో యూరియా, నానో డి.ఏ.పీ లు రైతులకు విక్రయించనున్నట్లు వివరించారు. రైతు సోదరులు అందరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని తమకు కావలసిన విత్తనాలను సేకరించుకోవాలని కోరారు.

# పాములతో బెంబేలు



**ప్రజాపక్షం/అనంతగిరి :** మండలంలోని వెంకట్రాపురం గ్రామంలోని ఇందిరమ్మ కాలనీలో నివసిస్తున్న ప్రజలు ప్రతిరోజు పాములతో బెంబేలెత్తుతున్నారు. రాత్రి పగలు అని తేడాలేకుండా పాములు కాలనీలో సంచరించడంతో ప్రజలకు కంటిమీద కునుకు లేకుండాపోయింది. పాములు వచ్చి ఏక్కడ కాటు వేస్తాయోనని భయపడుతున్నారు. గతంలో పాముకాటుతో ఇద్దరు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయినట్లు కాలనీవాసులు చెబుతున్నారు. కాలనీలో 120 గృహాలు ఉండగా 300 మంది నివాసం ఉంటున్నారు. ట్రాన్స్‌కో అధికారులు విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయకపోవడం, డ్రైనేజీ వ్యవస్థ సరికా లేకపోవడంతో పాములకు నిలయంగా మారిందని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.

# పవన్ కళ్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌పై సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తుందని జనసేన పార్టీ సూర్యాపేట నియోజక వర్గ ఇంచార్జి ఏవి రావు అన్నారు. సోమవారం పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సొంత నియోజక వర్గంలో ప్రజా సమస్యలను, రోడ్ల దుస్థితిని గాలికి వదిలేసి, కేవలం పవన్ కళ్యాణ్‌ను విమర్శించడమే పరమావధిగా ఎమ్మెల్యే వ్యవహరిస్తున్నాడని మండిపడ్డారు. మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన ప్రజాప్రతినిధి మాట్లాడే భాష ఆయన స్థాయికి తగినట్లుగా లేదని, సినిమాల్లోని ఐటెం సాంగ్స్‌తో పోలుస్తూ మాట్లాడటం అత్యంత హేయమైన చర్య అని ధ్వజమెత్తారు. ఈ సమావేశంలో నాయకులు భూక్యా సైదులు నాయక్, ఓర్సు రవి, ఓరుగంటి జగదీశ్వరి, దండు మధు, ధరావత్ రవి, చింతకాయల లక్ష్మి నారాయణ, కోనేటి రవికుమార్ పాల్గొన్నారు.



# గంగమ్మ తల్లి కృపతో ప్రజలంతా సంతోషాలతో ఉండాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** శ్రీ గంగమ్మ తల్లి ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలందరి జీవితాల్లో సంతోషాలు నిండాలని, అందరూ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మా రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని ఉట్లపల్లి గ్రామంలో యాదవుల ఆధ్వర్యంలో శ్రీ గంగమ్మ తల్లి జాతర మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ వేడుకలకు విచ్చేసిన ఆయన అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఉట్లపల్లి గ్రామం నుండి దేవస్థానం వరకు 3 కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టనున్న నూతన రహదారి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు.అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా, గ్రామాల ప్రగతిలో వెనకడుగు వేసేదే లేదని అన్నారు. భక్తులు, గ్రామస్థులు సౌకర్యవంతంగా దేవస్థానానికి చేరుకునేలా ఈ రహదారి నిర్మాణం ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, యాదవ సంఘ నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల సభ్యత్వ నమోదు ముమ్మరం




ప్రజాపక్షం/ మిర్యాలగూడ: పిఆర్టీయూ మిర్యాలగూడ అర్బన్ శాఖ ఆధ్వర్యంలో మండల పరిధిలోని ఉపాధ్యాయుల సభ్యత్వ నమోదు కార్యక్రమం సోమవారం ముమ్మరంగా సాగింది. పట్టణంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలకు చెందిన వంద మందికి పైగా ఉపాధ్యాయులు ఈ సందర్భంగా పిఆర్టీయూ సంఘంలో చేరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన పిఆర్టీయూ అర్బన్ శాఖ అధ్యక్షులు మునగాల రామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి అనుముల సైదిరెడ్డి, రాష్ట్ర క్రమశిక్షణ సంఘం సభ్యులు పాతూరి యాదగిరిరెడ్డిలు మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే ఏకైక అజెండాగా పిఆర్టీయూ నిరంతరం పనిచేస్తుందని, గతంలోనూ, ఇప్పుడు, ఎల్లప్పుడూ ఉపాధ్యాయులకు అండగా ఉండేది తమ సంఘమేనని స్పష్టం చేశారు. నోషనల్ ఇంక్రిమెంట్ల సాధనతో పాటు, గత పిఆర్‌సిలో 30 శాతం ఫిట్‌మెంట్ ఇప్పించడంలో పిఆర్టీయూ ప్రముఖ పాత్ర పోషించిందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ధర్మా నాయక్, జీహెచ్ఎంలు విజయకుమారి, లక్ష్మి, కురువ, సంఘం రాష్ట్ర బాధ్యులు ఉపేందర్ రెడ్డి, దస్తగిరి, సుదర్శన్ రెడ్డి, నాయకులు మచ్చ రఘు, కలమ్మ, హబీబా, జయంతి, లక్ష్మి, ఫిరోజ్, సైదిరెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేటు పాఠశాలల్లో విద్యా దోపిడీపై చర్యలు తీసుకోవాలి




**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పట్టణంలోని పలు ప్రైవేటు పాఠశాలల్లో నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న విద్యా దోపిడీని అరికట్టాలని, నిబంధనలు ఉల్లంఘిస్తున్న విద్యాసంస్థలపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ డిమాండ్ చేశారు. మిర్యాలగూడ పట్టణానికి విచ్చేసిన జిల్లా విద్యాశాఖ అధికారి సుశిందర్‌రావును సోమవారం సంఘాల నాయకులతో కలిసి ఆయన మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల మనసారా వసూళ్లకు అడ్డుకట్ట వేయాలని కోరుతూ డీఈఓకు ఒక వినతిపత్రాన్ని సమర్పించారు. అనంతరం తిరుమలగిరి అశోక్ మాట్లాడుతూ, మిర్యాలగూడ పట్టణంలో ఉన్న ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలను ఏమాత్రం ఖాతరు చేయకుండా, తమ ఇష్టానుసారంగా ఫీజుల పట్టికలను తయారు చేసుకుని విద్యా వ్యాపారానికి పాల్పడుతున్నాయని మండిపడ్డారు. ముఖ్యంగా మధ్యతరగతి, పేద విద్యార్థుల తల్లిదండ్రులే లక్ష్యంగా చేసుకొని ప్రైవేటు పాఠశాలలు అత్యధిక మొత్తంలో డొనేషన్లు, ఫీజులు వసూలు చేస్తూ వారిని తీవ్ర ఆర్థిక శోభకు గురిచేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యాబోధన పక్కనబెట్టి, ప్రతి ప్రైవేటు పాఠశాల ఒక వ్యాపార కేంద్రంగా మారిందని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో గిరిజన విద్యార్థి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు రవీందర్ నాయక్, బీసీ యువజన సంఘం జిల్లా కో కన్వీనర్ సిద్ధం రాజు, ఎల్ హెచ్ పి ఎస్ జిల్లా అధ్యక్షులు సైదా నాయక్, బీసీ యువజన సంఘం నియోజకవర్గ నాయకులు మునగాల శైలేందర్, పట్టణ నాయకులు పట్టేటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఫీజు నియంత్రణ చట్టం తీసుకురావాలని కలెక్టర్‌కు వినతి



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** ఫీజు నియంత్రణ చట్టం తీసుకురావాలని కోరుతూ తెలంగాణ విద్యార్థి జన సమితి జిల్లా అధ్యక్షులు బొమ్మగాని వినయ్ గౌడ్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రైవేట్, కార్పోరేట్ స్కూళ్లు, కళాశాలలు విద్యను వ్యాపారంగా మార్చి తల్లిదండ్రులను దోపిడి చేస్తున్నాయని మండిపడ్డారు. విద్య అందరికి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని పదే పదే హామీలు ఇస్తున్నప్పటికి అవి కేవలం ప్రకటనలకే పరిమితమవుతున్నాయని విమర్శించారు. రాష్ట్రంలోని పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం రోజురోజుకు భారంగా మారుతోందన్నారు. ప్రభుత్వ నిబంధనలను పట్టించుకోకుండా లక్షల రూపాయల ఫీజులు వసూలు చేస్తున్నప్పటికి వారిపై కఠిన చర్యలు లేకపోవడం దురదృష్టకరమన్నారు. అధిక ఫీజుల భారం వల్ల వేలాది మంది తల్లిదండ్రులు అప్పుల పాలవుతుండగా, విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురవుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు దినేష్ నాయక్, ఈశ్వర్ సింగ్, వరుణ్, హర్ష రింగు, మహేష్ పాల్గొన్నారు.

# నేతాజీ మార్గంలో నవభారత నిర్మాణం



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** నేతాజీ సుభాష్ చంద్రబోస్ చూపిన విప్లవాత్మక మార్గంలో నవభారత నిర్మాణానికి నేటి యువత కదం తొక్కాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రధాన కార్యదర్శి పరంగి రాము అన్నారు. బలమైన, ఐక్యమైన మరియు స్వయం సమృద్ధమైన భారతదేశాన్ని ఆవిష్కరించాలనే మహోన్నత లక్ష్యంతో నేతాజీ స్థాపించిన ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ 87వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలను ఉమ్మడి నల్లగొండ జిల్లా పార్టీ కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి, నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టియుసిసి జిల్లా కన్వీనర్ ఎండి జలీల్ బాబా, ఆదినారాయణ, ఏఐవైఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రామకృష్ణ, నాగరాజు, ఏఐఎస్బి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి నశీర్ బాబా, సమీర్, అంజి, ఏఐఏఎంఎస్ జిల్లా కన్వీనర్ లక్ష్మి దేవి, దుర్గమ్మ పాల్గొన్నారు.

# మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరం




**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** డ్రగ్స్, గంజాయి లాంటి మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని సూర్యాపేట పట్టణ సిఐ వెంకటయ్య కోరారు. సోమవారం పట్టణంలోని జయ జూనియర్ కళాశాలలో పట్టణ పోలీసుల ఆధ్వర్యంలో అంతర్జాతీయ మత్తుపదార్థాల వ్యతిరేక, అక్రమ రవాణా నిరోధక దినోత్సవం జూన్ 26 సందర్భంగా విద్యార్థులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే గంజాయి లాంటి మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని, జీవితాలను నాశనం చేసే వ్యసనాల బారిన పడకూడదని సూచించారు. గంజాయి, డ్రగ్స్ వంటి మత్తుపదార్థాల వల్ల కలిగే శారీరక, మానసిక నష్టాలను వివరించారు. వాటిని వాడినా, విక్రయించినా, లేదా రవాణా చేసినా చట్టపరంగా కఠిన శిక్షలు ఉంటాయని హెచ్చరించారు. ఎవరైనా మత్తు పదార్థాలు విక్రయిస్తున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు డయల్ 100, 112కు, తెలంగాణ రాష్ట్ర ఈగల్ పోలీస్ టోల్ ఫ్రీ నంబరు 1908కి సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆర్‌డిఓకు వినతి

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్ :** పట్టణంలో నాన్‌జ్యుడిషయల్ స్టాంప్ వెండర్స్ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ అధిక ధరలకు స్టాంప్‌లు అమ్ముతున్నారని బిఆర్‌ఎస్‌వి రాష్ట్ర నాయకులు జనిగ సందీప్ ఆధ్వర్యంలో సోమవారం ఆర్‌డిఓకు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ మార్కెట్‌లో రూ.20ల విలువైన స్టాంప్‌ను రూ.40 నుంచి 50 వరకు, రూ.50 స్టాంప్‌ను రూ.80 నుండి 100వరకు, రూ.100 స్టాంప్‌ను రూ. 170 నుండి 200 వరకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. దీంతో సామాన్యులపై భారం పడుతుందని వెంటనే ధరలను నియంత్రించి వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**ప్రైవేట్ పాఠశాలల ఫీజులను నియంత్రించాలి...**

ప్రైవేట్ పాఠశాలల ఫీజులను నియంత్రించాలని కోరుతూ బిఆర్‌ఎస్‌వి రాష్ట్ర నాయకులు జనిగ సందీప్ ఆధ్వర్యంలో సోమవారం మండల విద్యాధికారి భూక్య సైదా నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఫీజులను వెంటనే నియంత్రించి పేద విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మెరిగ సాయి పాల్గొన్నారు.





## క్షేత్రస్థాయిలో నష్ట పరిశీలన

**ప్రజాపక్షం/పెన్‌పహాడ్ :** ఇటీవల ఈదురు గాలులతో నష్టపోయిన మండలంలోని దుబ్బతండ గ్రామంలో రెవెన్యూ అధికారులు సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అజీజ్, గ్రామ పరిపాలన అధికారి మధుతో కలిసి గ్రామంలో పర్యటించి జరిగిన నష్టంపై పూర్తి వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము గ్రామంలో ఇంటింటికి వెళ్లి జరిగిన నష్టాన్ని అంచనా వేసి ఉన్నతాధికారులకు సమగ్ర నివేధికను తయారు చేసి అందజేస్తామన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్టుకొమ్మలను తొలగించేందుకు నేడు (మంగళవారం) పట్టణంలోని 1టౌన్ పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని 1 టౌన్ ఏఈ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8.30 గంటల నుండి 10.30 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. జమ్మిగడ్డ, జమ్మిగడ్డ హౌసింగ్ బోర్డ్ కాలనీ, లైయన్స్ క్లబ్ వెనుక, భారత్ గ్యాస్ ఆఫీసు వెనుక, కుమ్మరి బజార్ దగ్గర, గౌండ్ల బజార్, అలంకార్ రోడ్డు, బొడ్రాయి బజార్, తహశీల్దార్ ఆఫీస్ దగ్గర, కొత్త గూడెం బజార్, రాజీవ్‌నగర్, బతుకమ్మ చౌరస్తాలలో విద్యుత్ అంతరాయం ఉంటుందని తెలిపారు.

## డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన సదస్సు



**ప్రజాపక్షం/నేరేడుచర్ల :** డ్రగ్స్ నిర్మూలనపై పట్టణంలోని గురుకుల పాఠశాలలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సైదిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే గంజాయి లాంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, జీవితాలను నాశనం చేసే వ్యసనాల బారిన పడవద్దని అన్నారు. గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల వల్ల శారీరక, మానసిక సమస్యలు తలెత్తి నష్టం జరుగుతుందన్నారు. విద్యార్థులు చదువు, క్రీడల పైనే దృష్టి సారించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. అనంతరం విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. యాంటీ డ్రగ్స్ సోల్జర్ సెల్ఫీ స్టిక్స్ కార్యక్రమంలో భాగంగా పాఠశాల ప్రాంగణంలో డ్రగ్స్ సోల్జర్ సెల్ఫీ స్టిక్స్‌ను ఏర్పాటు చేశారు. పాఠశాల ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## విత్తన మేళాను రైతులు సద్వినియోగం

**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం నేడు సన్న రకాల వరి విత్తనాలు సంస్థాన్ నారాయణపురం మండలం పుట్టపాక గ్రామంలోని రైతు వేదికలో అందుబాటులో ఉంటాయని, రైతులు తమకు అవసరమైన నాణ్యమైన విత్తనాలను ఒకే చోట కొనుగోలు చేయాలని మండల వ్యవసాయ అధికారిని బి.పూజ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని రైతులందరు ఈ విత్తన మేళాలో పాల్గొనాలని కోరారు.

## ప్రైవేట్ పాఠశాల వద్దు ప్రభుత్వ పాఠశాలలు ముద్దు




**ప్రజాపక్షం/గుండాల;** ప్రైవేట్ పాఠశాలలు వద్దు ప్రభుత్వ పాఠశాలలు ముద్దు అనే నినాదంతో సోమవారం గుండాల మండల పరిధిలోని గంగాపురం గ్రామస్తులు, పంచాయతీ పాలకవర్గం గ్రామంలోకి వచ్చే ప్రైవేట్ స్కూల్ వ్యాన్‌లను అడ్డుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా సర్పంచ్ కాళీ మంజుల ఆంజనేయులు మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలను తీర్చిదిద్దుతున్నామని, గ్రామ ప్రజలు, దాతల సహకారంతో పాఠశాలలో మౌలిక సదుపాయాలతో పాటు అన్ని రకాల సౌకర్యాలను ఏర్పాటు చేయడం జరిగిందని విద్యార్థులు తల్లిదండ్రులు అధిక ఫీజులు కట్టి ప్రైవేట్ పాఠశాలలో చేర్పించేకన్న అన్ని వసతులు, నాణ్యమైన విద్య అందిస్తున్న ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని కోరారు. అదే విధంగా ప్రభుత్వ పాఠశాలలో ఉచితంగా పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, బ్యాగ్‌లు, ఆల్పాహారం, మధ్యాహ్న బోజన సదుపాయాలు ప్రతి ఒక్కటి అందజేయడం జరుగుతుందని అన్నారు. ఈకార్యక్రమంలో మాజీ సర్పంచ్ సైదులు, వార్డు సభ్యులు సురేష్, సుమలతశ్రీను, రమా రవి, విజయ్ భాస్కర్‌రెడ్డి, విక్రం, నాగరాజు, నరసయ్య, సోమయ్య, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## రూ.32,500 పాఠశాల అభివృద్ధికి విరాళం



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** అధికార పక్షం పోటీని తట్టుకొని సర్పంచ్ ఎన్నికల్లో గెలిచిన తర్వాత వచ్చిన గౌరవ వేతనం మొదటి చెక్కు రూ.32,500 లను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి విరాళం ఇచ్చి దాతృత్వం చాటుకున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మండలం ఇంద్రియాల గ్రామ సర్పంచ్ ధీరావత్ వెంకష్ యువకుడిగా గ్రామ ప్రజల ఆశీర్వాదంతో గెలిచి ప్రభుత్వం ద్వారా అందుతున్న నిధులను అభివృద్ధి కోసం వెచ్చిస్తూ ప్రజా సేవ కోసం పరితపిస్తూ ఎంతో మందికి స్ఫూర్తిగా నిలిచారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు పాఠశాల విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తూ సర్పంచ్ కు ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బండి కృష్ణ గౌడ్, ఉప సర్పంచ్ రెవెల్లి అశోక్, మాజీ ఎంపీటీసీ ఎదునోజు రాము, మొగిలిపాక గోపాల్, కుమ్మరి బుచ్చిబాబు, వార్డ్ మెంబెర్స్ మరియు పెద్దిరెడ్డి యాదగిరి, గారిసే జంగయ్య, మహేందర్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి సహకరిస్తా..




**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి తన వంతు సహాయం చేస్తానని ఇఎల్‌వి ఫౌండేషన్ చైర్మన్ భాస్కర్ హామీ ఇచ్చారు. సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలోని తెలంగాణ ప్రభుత్వ పీఎం మోడల్ పాఠశాల మరియు జూనియర్ కళాశాలలకు ఫౌండేషన్ తరపున ఆయన 30 లక్షల విలువచేసే బస్సును బహూకరించారు. ఈ బస్సును సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ స్థానిక అధికారులతో కలిసి ఆయన ప్రారంభించారు. పాఠశాలల విద్యార్థిని విద్యార్థులు భాస్కర్‌కు ఘనమైన స్వాగతం పలికి కృతజ్ఞత సభ ఏర్పాటు చేసి వారిచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతిభ కలిగిన విద్యార్థులు విద్యార్థులకు ఉన్నత చదువుల కోసం సహాయం చేసేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మోడల్ కళాశాల ప్రిన్సిపల్ దీప, స్థానిక ఎంఈఓ గోలి శ్రీనివాస్, ఉప సర్పంచ్ పల్లె మల్లారెడ్డి, సర్పంచులు ఉప్పల రమేష్, ఉప సర్పంచ్లు వెలిజాల శ్రీను, బండమీది కిరణ్, ఈఎల్‌వి ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## వ్యక్తిగత ప్రమాద బీమా

**ప్రజాపక్షం/రామన్నపేట :** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల పరిధిలోని బోగారం గ్రామంలో గ్రామప్రజలకు నిరంతరం సేవలందిస్తూ, పారిశుధ్య నిర్వహణలో కీలక పాత్ర పోషిస్తున్న గ్రామపంచాయతీ సిబ్బంది భద్రత కోసం బోగారం గ్రామ సర్పంచ్ కూనురు సాయి కుమార్ గౌడ్ గ్రామపంచాయతీలో పనిచేస్తున్న సిబ్బంది అందరికీ ఆయన 15 లక్షల ఉచిత వ్యక్తిగత ప్రమాద బీమా (యాక్సిడెంటల్ ఇన్సూరెన్స్) చేయించారు. గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన ప్రత్యేక కార్యక్రమంలో సిబ్బందికి బీమా పత్రాలను సర్పంచ్ కూనురు సాయి కుమార్ గౌడ్ స్వయంగా అందజేశారు.



## కమిషనర్ హనుమంతరావుకు వినతి

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** మండలంలోని ఇంద్రియాల గ్రామంలోని అన్యాక్రాంతమైన దేవాలయ భూములను కాపాడాలని కోరుతూ సోమవారం దేవాదాయ ధర్మదాయ శాఖ తెలంగాణా ప్రభుత్వ కమీషనర్ హనుమంతరావుకు వేణుగోపాలస్వామి ఆలయ చైర్మన్ చింతల రామకృష్ణ ఆధ్వర్యంలో పాలక మండలి వినతి పత్రాన్ని సమర్పించారు. ధర్మవాణీ కార్యక్రమంలో కలిసి సర్వే నెంబర్లు వారీగా వివరాలు అందించారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ దేవాలయ భూములను ఆక్రమిస్తే ఉపేక్షించేది లేదని అన్నట్టుగా అధ్యక్షులు తెలిపారు. దేవాలయం భూముల కోసం గ్రామ ప్రజలంతా పోరాడాలని పాలక మండలి పిలుపునిచ్చారు.






## మాదక ద్రవ్యాలపై అవగాహన సదస్సు

**ప్రజాపక్షం/రామన్నపేట :** ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాదక ద్రవ్యాలు , అక్రమ రవాణా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రామన్నపేట సర్పంచ్ గరిక సత్యనారాయణ, ఎస్సై నాగరాజు, కళాశాల ప్రిన్సిపల్ జగదీష్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలను ఏ విధంగా నివారించాలని విద్యార్థులకు వివరించారు. అందరూ కలిసి మాదకద్రవ్యాల నిరోధకంపై ప్రతిజ్ఞ చేశారు. యువత మేలుకో డ్రగ్స్ మానుకో, డ్రగ్స్ మానుకో జీవితం మలుచుకో, డ్రగ్స్ వద్దు ఆరోగ్యం ముద్దు వంటి విషయాలు విద్యార్థులకు వివరించారు. బిగ్ టీవీ వ్యాఖ్యాత నీలా నరసన్న విద్యార్థులను మాదక ద్రవ్యాల నిరోధకంపై తనదైన ధోరణిలో విద్యార్థులకు అర్థమయ్యే విధంగా తన పాటలతో ఉత్తేజపరిచి, మంచి అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు వుప్పల నరసింహారావు, దొడ్డి అశోక్ కుమార్, అధ్యాపకులు ప్రసూనాదేవి, వెంకట్ రెడ్డి, పున్నారావు, కిరణ్, కవిత, నిర్మల, రాజేశ్వరి, నగేష్, శ్రీకాంత్, అశోక్ రెడ్డి, జానయ్య, ఉపేందర్ రావ్, ఉమారాణి, కరుణ, పరశురాములు, శ్రవణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ అధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** కొండమల్లేపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా కాంగ్రెస్ సినియర్ నాయకులు, మాజీ వైస్ ఎంపిపి కాసర్ల వెంకటేశ్వర్లు నియమించబడినట్లు ఆయన తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో అంచెలంచేలుగా ఎదిగిన కాసర్ల వెంకటేశ్వర్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా నియమించబడటం వలన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా కాసర్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తన నియమాకానికి సహకరించిన దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్, మాజీ ఎంపిపి దూదిపాల రేఖ శ్రీధర్‌రెడ్డి, పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ ఎంఏ. సిరాజ్‌ఖాన్, పిఏసిఎస్ చైర్మన్ డా. వేణుధర్‌రెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. తనపై నమ్మకం ఉంచి మండల అధ్యక్షుడిగా ప్రకటించినందుకు పార్టీ నిబంధనల ప్రకారం పనిచేసి మండలంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు.

## ఏఐకెఎంఎస్ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

**ప్రజాపక్షం/కోదాడ :** ఏఐకెఎంఎస్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఆ సంఘం నాయకులు సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలో జరిగిన సంఘం 2వ మహాసభలో జిల్లా అధ్యక్షునిగా కనుకుంట్ల సైదులు, ఉపాధ్యక్షులుగా అలుగుబెల్లి వెంకట్‌రెడ్డి, కాశయ్య, ప్రధాన కార్యదర్శిగా బొడ్డు శంకర్, సహాయ కార్యదర్శులుగా దాసరి శ్రీనివాస్, కోట మధుసూదన్ రెడ్డి, కోశాధికారిగా మేకల కాంతారావులతోపాటు మరో 10 మంది సభ్యులను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులతో ఆ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి యం. డేవిడ్ కుమార్ ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం పలు తీర్మానాలు చేశారు.

## పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** ప్రభుత్వ నిబంధనలు పాటించని ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం ఎన్ఎస్‌యూఐ దేవరకొండ నియోజకవర్గ నాయకులు రమావత్ సేవానాయక్, గుండాల రాజేష్ యాదవ్‌లు మండల విద్యాశాఖ అధికారి రమావత్ నాగేశ్వర్‌రావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సేవానాయక్ మాట్లాడుతూ మండల కేంద్రంలో ప్రభుత్వ అనుమతి లేకుండా నడుస్తున్న పాఠశాలలు, సరైన వసతులు, పూర్తి అనుమతులు లేనటువంటి పాఠశాలలను, అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలపై ప్రభుత్వ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.





## నూతన విద్యుత్ దీపాలు

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్** : 22వ వార్డులో పలు చోట్ల విద్యుత్ దీపాలు వెలగడం లేదని వాటి స్థానంలో కొత్త లైట్లు చేయాలని కౌన్సిలర్ జాలిగం విఘ్నేష్ మూడు రోజుల క్రితం మున్సిపల్ కమిషనర్‌కి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. వెంటనే స్పందించిన అధికారులు సోమవారం నూతన 72W లైట్లను ఏర్పాటు చేశారు. వెంటనే స్పందించి త్వరితగతిన లైట్లు ఏర్పాటు చేసినందుకు వార్డు ప్రజల తరపున కమిషనర్‌కి ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు.

## స్నేహితుల దాతృత్వం



**ప్రజాపక్షం/రామన్నపేట** : తమతో కలిసి మెలిసి తిరిగిన స్నేహితుడు మృతి చెందగా అతని కుటుంబానికి అండగా మేమున్నామంటూ తోటి స్నేహితులు ముందుకొచ్చారు. యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం నీర్నెముల గ్రామానికి చెందిన గంగుల అమరేందర్ రెడ్డి గతవారం మరణించిన విషయం తెలుసుకొని నీర్నెముల ప్రాథమిక కొన్నత పాఠశాలలో 1999/2000 ఏడవ తరగతి బ్యాచ్ స్నేహితులంతా కలిసి వారి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు నోముల శివ కుమార్, సుర్వి మల్లేష్, సుర్వి వీరేశం, నోముల లింగస్వామి, నెమనంది రమేష్, గంగుల నవీన్ రెడ్డి, శాంకొండ్ల శ్రవణ్, మంగమ్మ పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్‌పై ప్రత్యేక శిక్షణ

**ప్రజాపక్షం/మోటకొండూర్** : ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) పై బిఎల్ఓలకు యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశాల మేరకు మోటకొండూర్ తహసీల్దార్ కార్యాలయంలో ఈ నెల 23,24 రెండు రోజులు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు బిఎల్ఓలు అందరు సకాలంలో హజరు కావాలని మోటకొండూర్ తహసీల్దార్ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు.

## చండూరు మండల కాంగ్రెస్ నూతన అధ్యక్షుడుగా సాగర్‌రెడ్డి



**ప్రజాపక్షం/చండూరు:** చండూరు మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడుగా కస్తాల గ్రామానికి చెందిన మేకల సాగర్ రెడ్డిని నీయమిస్తూ తెలంగాణ పిసిసి అధ్యక్షుడు మహేష్ కు మార్ గౌడ్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశా రు. తనపై నమ్మకంతో చండూరు మండల అధ్యక్షుడుగా నీయమాకం చేసిన పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌కు , జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పున్న కైలాస్ నేతకు , మాజీ మండల అధ్యక్షుడు కొరిమి ఓంకారం కు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## మానవత్వం చాటిన విబిఎన్ ఫౌండేషన్..



**ప్రజాపక్షం/నందికొండ:** మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డుకు చెందిన మొగ్గ శ్రీను గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఇదే సమయంలో ఆయన భార్య కూడా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నారు. కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం స్థానికుల ద్వారా తెలుసుకున్న విబిఎన్ ఫౌండేషన్ అండ్ సర్వీసెస్ డైరెక్టర్ దాసరి నినన్ స్పందించి,వారి వైద్య చికిత్స నిమిత్తం తక్షణ ఆర్థిక సహాయం అందజేశారు.ఈసందర్భంగా దాసరి నినన్ మాట్లాడుతూ మొగ్గ శ్రీను త్వరగా కోలుకోవాలని, అలాగే క్యాన్సర్‌తో చికిత్స పొందుతున్న ఆయన భార్య ఆరోగ్యం కూడా మెరుగుపడాలని ఆకాంక్షించారు.కుటుంబ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని వైద్య ఖర్చులు అధికంగా ఉన్నందున దాతలు, సేవా సంస్థలు మరియు ఆర్థికంగా స్తోమత ఉన్నవారు ముందుకు వచ్చి బాధిత కుటుంబానికి సహాయం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో నాగార్జున,మంజుల,జనార్ధన్,సైదేందర్ పాల్గొన్నారు.

## యూరియా యాప్ రద్దు చేయాలని ధర్నా



**ప్రజాపక్షం/నకిరేకల్** : వ్యవసాయ రంగంలో రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న యూరియా యాప్‌ను తక్షణమే రద్దు చేయాలని,అలాగే విపరీతంగా పెంచిన ఎరువుల ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ సోమవారం రైతు సంఘం ఆధ్వర్యంలో వ్యవసాయ అధికారి కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు.అనంతరం మండల వ్యవసాయ అధికారికి మహమ్మద్ జానీ మియాకు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర మహిళ కన్వీనర్ కందాల ప్రమీల మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాల వల్ల అన్నదాతలు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.యూరియా కొనుగోలుకు కొత్తగా ప్రవేశపెట్టిన డిజిటల్ యాప్ విధానం వల్ల గ్రామీణ ప్రాంతాల్లోని సామాన్య,నిరక్షరాస్యులైన రైతులకు ఎరువులు సకాలంలో దొరక్క అల్లాడిపోతున్నారని మండిపడ్డారు. సాంకేతిక సమస్యలు,సర్వర్ లోపాల వల్ల యూరియా కోసం గంటల తరబడి పడిగాపులు కాయాల్సి వస్తోందని,ఈఇబ్బందులను తొలగించాలంటే యూరియా యాప్‌ను వెంటనే రద్దు చేయాలని ఆమె డిమాండ్ చేశారు.ఈకార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షులు గింజల లక్ష్మి, మండల కార్యదర్శి ఆకుల భాస్కర్, వివిధ ప్రజాసంఘాల నాయకులు వంటెపాక వెంకటేశ్వర్లు,అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## గోరెంకలపల్లి ప్రీ ప్రైమరీ తరగతులు ప్రారంభం




**ప్రజాపక్షం/నకిరేకల్** : మండలంలోని గోరెంకలపల్లి ఎంపీయూపీఎస్‌లో సోమవారం ప్రీప్రైమరీ(యూకేజీ) తరగతులను గ్రామ సర్పంచ్ నర్సింగ్ ఎల్లయ్య, మండల విద్యాధికారి మేక నాగయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలోని తల్లిదండ్రులు చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని వారు సూచించారు. ఈ సందర్భంగా పాఠశాలకు పల్ రెడ్డి శ్రీనివాస్ రెడ్డి రూ.10 వేల విలువైన నోట్‌బుక్‌లు, నకిరేకల్‌కు చెందిన శ్రీ రామకృష్ణ మెడికల్ షాప్ యజమాని శ్రీధర్ రూ.3 వేల విలువైన పలకలు,పెన్నులు,పెన్సిళ్లు అందజేశారు.ఈ సందర్భంగా దాతలను సన్మానించారు.ఈకార్యక్రమంలో నకిరేకల్ కాంప్లెక్స్‌ప్రధానోపాధ్యాయులు కె.రాములు,పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.వెంకటయ్య,ఏపీసీ చైర్‌పర్సన్ సరిత, వార్డు సభ్యులు,సిహెచ్ వెంకన్న,సోమయ్య,రవి,రేణుక గ్రామ పెద్దలు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రీ ప్రైమరీ ఇన్స్ట్రక్టర్లు, ఆయా పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

**ప్రజాపక్షం/తిరుమలగిరి సాగర్** : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ (యూకేజీ) తరగతుల నిర్వహణ గాను అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మండల విద్యాధికారి కొనమంచలి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. 2026/27 విద్యా సంవత్సరానికి గాను మండలంలోని శిల్గాపురం, తిరుమలగిరి ప్రాథమిక పాఠశాలలు,అల్వాల, రంగుండ్ల తండా ప్రాథమికోన్నత పాఠశాలలో తాత్కాలిక ప్రాతిపాదికన ప్రీ ప్రైమరీ ఇన్స్ట్రక్టర్లు (టీచర్లు), ఆయాలపోస్టుల నియామకం జరగనుందని తెలిపారు. పోస్ట్‌కు ఎంపికైన వారికి నెలకు రూ. 8,000 గౌరవ వేతనం ఉంటుందని అదేవిధంగా ఆయా మహిళ పోస్టుకు 7వ తరగతి ఉత్తీర్ణులై మార్కుల జాబితా ఉండాలి.ఈ పోస్ట్‌కు ఎంపికైన వారికి నెలకు రూ. 6,000 గౌరవ వేతనం చెల్లిస్తామన్నారు.ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 22వ తేదీ నుండి 26వ తేదీ సాయంత్రం 4 గంటల లోపు దరఖాస్తులు చేసుకోవాలని, వివరాలకు ఎంఆర్ సి తిరుమలగిరి నందు సంప్రదించగలరు.అందుకు సంబంధించిన దరఖాస్తు ఫారాలు ఆన్లైన్ సెంటర్లో డౌన్లోడ్ చేసుకొని పూర్తిచేసిన దరఖాస్తులను ఎంఆర్ సి తిరుమలగిరి సాగర్ లో అందజేయాలని కోరారు.

## దశదినకర్మకు హాజరైన భువనగిరి ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి** : దంతూరు గ్రామానికి చెందిన జిల్లా యాదవ మహాసభ ఉపాధ్యక్షులు మా కోలు శ్రీనివాస్ తండ్రి మాకోలు మల్లయ్య అలియాస్ పాలమల్లయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు ఆయన దశదినకర్మకు భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి సోమవారం హాజరై ఆయన చిత్రపటానికి పూల మాలలు ఘన నివాళులు అర్పించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా సీనియర్ పాక మల్లేష్ యాదవ్, మండల అధ్యక్షులు ఉప్పునూతల వెంకటేష్ యాదవ్ పాల్గొన్నారు.



## నేటి నుంచి రైతు వేదికల్లో విత్తన మేళా

**ప్రజాపక్షం/తిప్పర్తి:** ఈనెల 23 నుంచి 30 వరకు జిల్లాలోని 140 రైతు వేదికల్లో విత్తన మేళా నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి సన్నీ రాజ్ తెలిపారు. సోమవారం రైతులకు అవగహన కల్పిస్తూ మాట్లాడుతూ అంతర్జాతీయంగా డిమాండ్ ఉన్న, వినియోగదారులు ఇష్టపడే, తక్కువ కాలపరిమితి కలిగిన నాణ్యమైన సన్నని వరి రకాలను ప్రోత్సహించడం ఈ మేళా ముఖ్య ఉద్దేశమన్నారు. బీపీటీ 5204, ఆర్ఎన్ఆర్ 15048,హెచ్ఎంటీ సోనా,కేఎన్ఎం 1638, కేఎన్ఎం 7715,డబ్ల్యూజీఎల్ 44,జై శ్రీరామ్ వంటి 7 రకాల సన్నరకం వరి విత్తనాలను రైతు వేదికల్లో అమ్మకానికి ఉంచుతారు. వీటికి ప్రభుత్వం బోనస్ ఇస్తుంది. కంది,పెసర, మినుము, నువ్వులు, కూరగాయల విత్తనాలు,నానో యూరియా కూడా అందుబాటులో ఉంటాయి.ఈ 7 రకాల వరి విత్తనాలకు ప్రభుత్వం బోనస్ ఇవ్వడానికి సిద్ధంగా ఉందని, ఎల్‌నినో పరిస్థితుల దృష్ట్యా ఇవి స్వల్పకాలిక రకాలు కావున త్వరగా పంట చేతికి వస్తుందని తెలిపారు. ఏఈఓలు సంతోషి, రజిత పాల్గొన్నారు.

## ప్రణాళికలు రూపొందిస్తాం



**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి:** గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికలో మహిళల అవసరాలను పొందుపరిచేందుకు నార్కట్‌పల్లి మేజర్ గ్రామపంచాయతీలో మంగళవారం మహిళా గ్రామసభ నిర్వహించారు.సర్పంచ్ జేరిపోతుల భరత్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సభలో తాగునీరు,పారిశుద్ధం,మహిళల ఆరోగ్యం, ఉపాధి, భద్రత, మౌలిక సదుపాయాలపై మహిళలతో చర్చించి సలహాలు స్వీకరించారు.గ్రామాభివృద్ధిలో మహిళల భాగస్వామ్యం కీలకమని, వారి అవసరాలకు తగ్గట్టు ప్రణాళికలు రూపొందిస్తేనే సమగ్ర అభివృద్ధి సాధ్యమని సర్పంచ్ పేర్కొన్నారు.కార్యక్రమంలో వార్డు సభ్యులు బకరం జనార్దన్,జిల్లా మహేష్, పర్రెపాటి సైదులు,నాయకులు బషీర్, పంచాయతీ కార్యదర్శి సీహెచ్. రవి కుమార్,సిబ్బంది,ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు,మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

తిరుగండ్లపల్లిలో మిషన్ భగీరథ పనుల పరిశీలన

## ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ ఆరా

**ప్రజాపక్షం/మర్రిగూడ** : మండలంలోని తిరుగండ్లపల్లి గ్రామంలో చేపట్టిన మిషన్ భగీరథ పైపులైన్ పనులను ఆర్డబ్ల్యూఎస్ ఏఈ ప్రభాకర్ సోమవారం పరిశీలించారు.గ్రామంలో జరుగుతున్న పైపులైన్ పనుల పురోగతిని,నాణ్యతను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు.అనంతరం స్థానిక ప్రభుత్వ పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అందుతున్న మంచినీటి వసతి గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు.మిషన్ భగీరథ ద్వారా పాఠశాలకు నిరంతరం స్వచ్ఛమైన తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ పందుల లక్ష్మమ్మ, జంగయ్య గౌడ్,పంచాయతీ కార్యదర్శి లక్ష్మి పాల్గొన్నారు.

## తాత్కాలిక అధ్యాపకుల నియామకం

**ప్రజాపక్షం/పెన్‌పహాడ్** : మండల కేంద్రంలోని కెజిబివి కళాశాలలో ఇంటర్ విద్యార్థులకు ఐఐటి, జెఈఈ లో ప్రత్యేక తరగతులు బోధించేందుకు తాత్కాలిక పద్ధతిలో అధ్యాపకుల నియామకం చేయనున్నట్లు ఎస్ఓ ఆషియా జబీన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 23 నుండి 25వ తేదీ వరకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఎంపికైన అధ్యాపకులకు బోధనా సమయాన్ని బట్టి గంటకు రూ.600 చొప్పున రెమ్యునరేషన్ చెల్లించడం జరుగుతుందన్నారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు వివరాల కోసం సెల్ 7702076193 సంప్రదించాలని కోరారు.

## నోట్‌బుక్‌లు, పెన్నుల పంపిణీ



**ప్రజాపక్షం/అర్వపల్లి** : మండలంలోని కాసర్లపహాడు ఎంపిపిఎస్ పాఠశాల విద్యార్థులకు గంజి సోమయ్య జ్ఞాపకార్థం ఆయన కుమారుడు రవి కిషోర్ రూ.10వేల విలువైన నోట్‌బుక్‌లు, పెన్నులు, పెన్సిల్, చాక్‌మార్లు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి బాలు, గ్రామ సర్పంచ్ మంచాల లలితా రాంమ్మూర్తి, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నర్సింహాచారి పాల్గొన్నారు.

# డ్రగ్స్ రహిత తెలంగాణే ధ్యేయం








**ప్రజాపక్షం/తుర్కపల్లి** : తుర్కపల్లి మండల కేంద్రం లోని స్థానిక పడాల ముత్యాలు మెమోరియల్ పాఠశాలలో సామాజిక అవగాహన కార్యక్రమల లో భాగంగా సోమవారం తుర్కపల్లి పోలీసు డిపార్ట్ మెంట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు డ్రగ్స్, గంజాయి, మాదక ద్రవ్యాల వల్ల జరిగే అనర్థాలు, నష్టాలపై అవగాహన కల్పించారు. డ్రగ్స్ రహిత తెలంగాణ మనందరి ధ్యేయం అని పిల్లల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో తుర్కపల్లి పోలీస్ సిబ్బంది హుస్సేన్, రైటర్ శివ, ఆంజనేయులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నర్సింహారెడ్డి, ఉపాధ్యాయుని ఉపాద్యాయులు తదితరులు పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/గుండాల;** డ్రగ్స్ రహిత సమాజనిర్మాణానికి మనమందరం కృషి చేయాలని గుండాల ఎస్ఐ శోభన్‌బాబు పిలుపునిచ్చారు. సోమవారం గుండాల మండల పరిధిలోని వెల్మజాల గ్రామంలోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన డ్రగ్స్ నిర్మూలన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో కలిసి ప్రతిజ్ఞ చేయించారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/పెన్‌పహాడ్** : డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యమని ఎస్ఐ కస్తాల గోపికృష్ణ అన్నారు. సోమవారం మండలంలోని లింగాల గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మత్తు పదార్థాల వ్యతిరేక, అక్రమ రవాణా నిరోధక దినోత్సవం సందర్భంగా గంజాయి, డ్రగ్స్ నిర్మూలనపై విద్యార్థులకు ప్రత్యేక అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు యండి జమాల్ షరీఫ్, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/నూతనకల్** : డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎస్ఐ నాగరాజు విద్యార్థులకు పిలుపునిచ్చారు. సోమవారం అంతర్జాతీయ మత్తు పదార్థాల వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/తుంగతుర్తి** : గంజాయి, డ్రగ్స్ నిర్మూలనపై అంతర్జాతీయ మత్తు పదార్థాల వ్యతిరేక, అక్రమ రవాణా నిరోధక దినోత్సవం సందర్భంగా సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు పోలీసులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ క్రాంతి కుమార్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే గంజాయి లాంటి మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఎవరైనా మత్తు పదార్థాలు విక్రయిస్తున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు డయల్ 100, 112కు, తెలంగాణ రాష్ట్ర ఈగల్



పోలీస్ టోల్ ఫ్రీ నంబరు 1908కి సమాచారం అందించాలని సూచించారు.

**ప్రజాపక్షం/నడిగూడెం** : డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో విద్యార్థుల పాత్ర చాలా కీలకమని సర్పంచ్ దున్నా శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం కొరకు విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణను అలవర్చుకొని ఎంచుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సరిత, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/నందికొండ:** జూన్ 26న నిర్వహించనున్న అంతర్జాతీయ మాదక ద్రవ్య నిరోధక దినోత్సవం సందర్భంగా సోమవారం హిల్ కాలనీలోని సెయింట్ జోసఫ్ ఉన్నత పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్ఐ సతీష్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల అలవాటు యువత భవిష్యత్తును నాశనం చేసుకోవద్దన్నారు. పాఠశాల ప్రిన్సిపల్ లలిత, ఉపాధ్యాయుల సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేశారు.

## మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా శశిధర్‌రెడ్డి

**ప్రజాపక్షం/డిండి** : కాంగ్రెస్ పార్టీ డిండి మండల నూతన అధ్యక్షులుగా మండలంలోని చెరుకుపల్లి గ్రామానికి చెందిన ముత్యాల శశిధర్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఈమేరకు సోమవారం తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటి (టిపిసిసి) అధ్యక్షులు, ఎంఎల్‌సి మహేష్‌కుమార్‌గౌడ్ ఉత్తర్వులను జారీ చేశారు.

## మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా జానయ్య

**ప్రజాపక్షం/త్రిపురారం:** మండల కేంద్రానికి చెందిన అల్లంపల్లి జానయ్య కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా ఎన్నికయ్యారు.ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు పున్నం కైలాస నేత సోమవారం నియామక పత్రం అందజేశారు.ఈ సందర్భంగా అధ్యక్షులు అల్లంపల్లి జానయ్య మాట్లాడుతూ మండలంలోని కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని మాజీ సీఎల్పీ నేత కుందూరు జానారెడ్డి,పార్లమెంటు సభ్యులు కుందూరు రఘువీర్ రెడ్డి, నాగార్జున సాగర్ ఎమ్మెల్యే జేవిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

## చందంపేట కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా మల్లారెడ్డి

**ప్రజాపక్షం/చందంపేట;** నల్గొండ జిల్లా చందంపేట మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షులుగా దొడ్డెటి మల్లారెడ్డి నియమితులయ్యారు. నూతనంగా నియమితులైన మల్లారెడ్డిని మండల నాయకులు ఘనంగా సన్మానించారు.

## ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే వీరేశం చిత్రపటానికి పాలాభిషేకం



**ప్రజాపక్షం/రామన్నపేట** : రామన్నపేటలో ఆదాని అంబుజా సిమెంట్ కంపెనీ ఏర్పాటు కాకుండా శాయశక్తుల కృషిచేసిన నకిరేకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ వేముల వీరేశం చిత్రపటానికి సోమవారం సుభాష్ సెంటర్‌లో పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం పట్టణ కేంద్రంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ కాలుష్య కారకమైన అంబుజ సిమెంట్ పరిశ్రమ ఏర్పాటుకు వ్యతిరేకంగా రామన్నపేట, కోమ్మాయి గూడెం, సిరిపురం, వెల్లంకి, బోగారం, పెద్ద కాపార్తి మండల ప్రజలు, అఖిలపక్షాలు చేసిన ప్రజా పోరాటానికి స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం అండాదండగా నిలబడి అంబుజ సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు కాకుండా అడ్డుకున్నారని వారన్నారు. ఇప్పుడు రామన్నపేట ప్రజలు ఊపిరి పీల్చుకున్నారని, మాకు ప్రధాన నాయకులు ఉన్నారని ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారని వారన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ గరిక సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు జినుకల ప్రభాకర్, గోదాస్ పృధ్వీరాజ్, పట్టణ అధ్యక్షుడు ఎండి జమీరుద్దీన్ జెల్ల వెంకటేశం, మాజీ ఎంపీటీసీ ఎండి రేహాన్ సాల్వేర్ అశోక్, వనం చంద్రశేఖర్, ఉపసర్పంచ్ మోటె రమేష్, వార్డు సభ్యులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## దేవరకొండ మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా సురేష్‌గౌడ్

**ప్రజాపక్షం/దేవరకొండ;** కాంగ్రెస్ పార్టీ దేవరకొండ మండల నూతన అధ్యక్షులుగా మండలంలోని తాటికోల్ గ్రామానికి చెందిన యువ నాయకులు, మాజీ జెడ్పిటిసి సలహాదారు మారుపాకుల సురేష్‌గౌడ్ నియమితులయ్యారు. ఈమేరకు సోమవారం తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటి టిపిసిసి అధ్యక్షులు, ఎంఎల్‌సి మహేష్‌కుమార్‌గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు సురేష్‌గౌడ్ మాట్లాడుతూ పార్టీ సినియర్లను, యువతను కలుపుకొని రాబోవు రోజుల్లో పార్టీ బలోపేతానికి కృషి చేయనున్నట్లు తెలిపారు. మండల పార్టీ అధ్యక్షులుగా తన నియామకానికి సహకరించిన దేవరకొండ ఎంఎల్‌ఏ బాలునాయక్, జిల్లా కోఆర్డినేటర్ సిరాజ్‌ఖాన్, మున్సిపల్ చైర్మన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు, నర్సింహా, శ్రీధర్‌రెడ్డి, వెంకటేష్‌గౌడ్, మండల సినియర్ నాయకులు, పార్టీ ప్రజా ప్రతినిధులకు, సర్పంచ్‌లకు, యువజన, మహిళా, విద్యార్థి నాయకులకు సురేష్‌గౌడ్ ధన్యవాదాలు తెలిపారు.



## 5 ఏళ్లుగా అసంపూర్తిగా నార్కట్‌పల్లి ప్రధాన రహదారి

### వెంటనే మరమ్మతులు చేపట్టాలని కలెక్టర్‌కు వినతి

**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి** : పట్టణంలో ప్రధాన రహదారి మరమ్మత్తు పనులు 2021 నుంచి అసంపూర్తిగా ఉన్నాయని,వర్షాకాలం ప్రారంభమైనందున పనులు త్వరగా పూర్తి చేయాలని బీజేపీ యువ నాయకుడు పాలకూరి రమేష్ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. బస్టాండ్ నుంచి నల్లగొండ వెళ్లే ప్రధాన మార్గంలో రోడ్డు తవ్వేసి వదిలేయడంతో పెద్ద గుంతలు ఏర్పడ్డాయని తెలిపారు.దీని వల్ల వాహనదారులు, ముఖ్యంగా కామినేని ఆసుపత్రికి వెళ్లే పేద రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాలకు గుంత ల్లో నీరు నిలిచి రోడ్డు బురదమయంగా మారిందని, ద్విచక్ర వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారని వివరించారు.గత ఐదేళ్లుగా పనులు పూర్తికాకపోవడంతో స్థానికులు, వ్యాపారులు నరకయాతన అనుభవిస్తున్నారని తెలిపారు.

## దోభీ ఘాట్ స్థలంలో వి.వో భవన నిర్మాణం చేపట్టవద్దు



**ప్రజాపక్షం/చండూరు:** మండల పరిధిలోని బంగారిగడ్డ గ్రామంలో రజక దోభీఘాట్ స్థలంలో వి.వో నూతన భవన నిర్మాణాన్ని నిర్మించవద్దని కోరుతూ బంగారిగడ్డ గ్రామానికి చెందిన రజకులు సోమవారం ఎంపిడిఓను కలిసి వినతి పత్రం అందజేశారు. సుమారు 200 సంవత్సరాలుగా వాగు పక్కన ఉన్న రెండు ఎకరాల స్థలంలో గ్రామానికి చెందిన 50 రజక కుటుంబాలు బట్టలు ఉతికి జీవనోపాధి పొంపుతున్నారని తెలిపారు. అట్టి స్థలంలో వి.వో భవనం నిర్మాణం చేస్తే రజకుల జీవనోపాధిపై తీవ్ర ప్రభావం పడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బంగారిగడ్డ శివగంగ రజక సంఘం సభ్యులు నల్పరాజు సత్తయ్య , యాదయ్య , క్రాంతి, గణేష్ , నర్సింహ్మా ,శ్రీశైలం , మహేష్ , నాగిళ్ల శంకర్ పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



**ప్రజాపక్షం/మేళ్లచెరువు** : విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ నవీన్ కుమార్ తెలిపారు. అంతర్జాతీయ మత్తు పదార్థాల వ్యతిరేక, అక్రమ రవాణా నిరోధక దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలీసుల ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

**మాదకద్రవ్యాల రహిత సమాజమే లక్ష్యం**

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** : సమాజానికి పట్టిన మహమ్మారి లాంటి మాదకద్రవ్యాలకు యువత, విద్యార్థులు దూరంగా ఉండాలని వన్ టౌన్ సీఐ రాజశేఖర రెడ్డి సూచించారు.సోమవారం పట్టణంలోని ప్రభుత్వ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై వన్ టౌన్ పోలీస్ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్,ఉపాధ్యాయ బృందం,వన్ టౌన్ పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

